# అనుబంధము

రమణశ్రీ

'చారీ బాబూ! నన్ను తీసుకెళ్లి ఏ లోయలసానువుల్లోనో పారేయండి! ప్రకృతి చేలాంచలాలు ముసురుతోన్న, బాహాటమైన ప్రకృతి సౌందర్యంలోనుంచి జారుతూ కేగుతూ కన్నుమూస్తాను. ఈ బాధ భరించలేను'—అన్నాను.

నా ఆవేదనలోనుంచి కవిత్వం పుడుతోంది. కళ్లలో తుపానులా భయం రేగుతోంది! భరించలేని తపన. ఆపాదమస్తకం కుదిపి పారేస్తోన్న చలిజ్వరం.

రోగపిశాచి కనుగ్రుడ్డులా మండుతోంది విద్యుద్దీపం. ఆ మంటలో మృత్యుజ్వాల... వెలుగు భరించలేక కళ్లుమూసుకొన్నాను.

అసలీ రోగకూపంలో కెందుకొచ్చాను? ఈ పర్వతాల్లో నేగాని మరెక్కడా ఉద్యోగం దొరకదా?... ఈ ఉద్యోగానికి నేను చేసిన పెద్దప్రయత్నమేమిలేదు. పిలిచి పిల్లనిచ్చిన సామెతలో కొట్టుకొంటున్నా......

నువ్వేనా మహా ఊడబొడిచిన వ్యక్తివి?...... శాస్త్రి, జ్వాలా నరసింహం నీవెరిగున్నవాళ్లెంతమంది పని చెయడంలేదు? అసలుద్యోగాలే దొరకని ఇలాంటి సమయంలో......

శాస్త్రి, జ్వాలా నరసింహం మాచ్‌ఖండ్ మహా శిఖరాలమీదనుంచి కేలెత్తి కేకలేశారు! డుడుమా జలపాతం స్వప్నసౌందర్యం నా కళ్లముందు మువ్వలుకట్టి తాండవించింది!

స్నేహితుల ఆహ్వానానికి తబ్బిబ్బులై, ఱెక్కలుకట్టుక వాలాను.

ఏవో జ్వరాలు, బాధలూ రాకండా ఉంటారా మానవులు?... అంతా చిత్రమైంది నా ప్రవృత్తి. ఏ చిన్నకష్టమొచ్చినా అది మృత్యుసమున్ముఖమైనంత నే తల్లడిలిపోతాను.

'చారిబాబు! నాకిక్కడ చావు రాసిపెట్టుందంటావా?' చారీబాబు ముఖంలో అవ్యక్తంగా నవ్వునీడ పడింది. 'పిచ్చివాడా! ఈమాత్రందానికే ఇంత బేజారెత్తిపోతావా? రేపొద్దుట, ఇంజనీరుగారికోసం జీపు వెడుతుంది. అందులో నిన్ను విశాఖపట్నం చేర్చేబాధ్యత నాది.'

అన్న హామీ చేత్తోపుచ్చుకొని, హృదయంలో దాచుకొన్నాను.

'ఇప్పుడెంతయింది?'

నా గొంతులో నీరసం మాటాడనివ్వడంలేదు. ఐనా గొంతు పెగుల్చుకొంటున్నాను.

'ఏడుగంటలయింది' చారీబాబు టైముచూసి చెప్పాడు. 'బార్లీ ఎక్కువగా తాగమన్నాడు డాక్టరు! మందు వేసుకొంటావా?'

చారీబాబు గొంతులో ఆప్యాయత నేనెలా పుణికిపుచ్చుకోను? అతని ఋణం నేనెలా తీర్చుకోను? స్నేహానికి ప్రాణం ఇవ్వాలంటాడు చారీ.

ఇక్కడీ స్వల్పకాలంలో నా బతుకున అంత ప్రముఖపాత్ర వహిస్తాడనుకోలేదు. శాస్త్రి, జ్వాలా నరసింహంమీద ఆశలు పెట్టుకొచ్చిన నాకీ చారీబాబు సుహృదయం ఈ కొండకోనల్లో, ప్రకృతి నిట్టూర్చిన గాడ్పులో దొరుకుతుందనుకోలేదు.

గాలి బాగా రావాలని కాబోలు కిటికీ ఱెక్కలు తెరిచాడు. దట్టంగా చీకటి! పగలంతా ఏ కొండగుహల్లోనో తలదాచుకొని రాత్రి బయటపడినట్టు— గాలి రివ్వున వీస్తోంది... ఆపాదమస్తకం కప్పుకొన్న శాలువలో నా చలికి చావులేదు! మరింత బిగుసుకుపోసాగాను.

ఈ పుణ్యమంతా చారీదే... ఈ గది, శాలువ సమస్తం నేనుపశమన పొందుతోన్న సుకృతం అంతా చారీదే!......

ఈ గది నానుకొన్న వరండాలో, దయ్యాలుండేవని, ఎవరూ ఈ పక్కకి రావడం మానేశారు.

చారీబాబు దయ్యాల దురాక్రమణను, జయించి, ఇక్కడ కాపురం పెట్టాడు.

'అంతా నన్ను చూసి భయపడుతున్నారల్లే వుంది! నే నేం పాపం చేశాను? నవ్వుతూ పేలుతూ తిరుగుతోన్నప్పుడు చుట్టూ మూసిరే స్నేహితులంతా, ఇప్పు డేమూల దాక్కొన్నారు? నా జ్వరం చూసి......'

చారీబాబుమాత్రం అన్నింటికీ తెగించినమనిషి! రెండు సంవత్సరాలు కొండప్రాంతంలో చక్కని అనుభవం గడించాడు. అప్పుడప్పుడు దొరగారితో వేటకుకూడా వెళ్ళేవాడంటున్నాడు. 'త్వరలో నిన్ను కూడా తీసుకొనివెడతా' అనే ఆశమాత్రం నాజ్వరంతో మిగిలిపోయింది!

మొదట ఉద్యోగంలో ప్రవేశించేముందు ఆఫీసులో టయింకీపరుగా సంతకాలు చేయించు కొంటూ, మస్తరు వేస్తోన్న ఈ చారీబాబు తెలుగు వాడేనని భ్రమసిపోయాను. కాని తెలుగు రాదని, బెంగాలీబాబు అని తెలియడంతో నే, నాగుండె ల్నెవరో అదాటుగా నొక్కినట్టయింది!

'ఈ అడవిలో నాలాంటి మొండివాళ్లు జీవించ వలసిందేగాని, నీబోటి సుకుమారు లుండడానికి కాదు. ఈపాటి ఉద్యోగం నీ కక్కడే దొరక్కపోయిందా?'

చారీబాబు మందలింపుకి నాకు దుఃఖంఆగలేదు. పైగా అతనిమాటలు హిందీలో, నా చెవుల్ని దూసుకు పోతున్నాయ్. 'నువ్వు విశాఖనించి డుడుమా బస్ సర్వీసులో తెల్లవారకండా కారెక్కి ఎలాప్రయాణం చేసి వచ్చావు?...ఈ భయంకరమైన అడవిలో ఏదో దాక్కొని వుందని చూడ్డానికి...ఆ మహాజలపాతం వైపు కళ్లెత్తిచూడు. దీనిప్రభావం, మీ తెలుగుదేశ మంతా, వెలుగులో ముంచెత్తిపోతుంది! ఈప్రకృతిలో ఇంత భయంకరమైన బాహాటమైన సౌందర్యం నిండి, నాలుగు దిక్కులు పరచుకొని యోగతపస్సులో ఉందని, నీవు ఊహామాత్రంగా నేనా ఆలోచించావా?

నే నెప్పుడూ ఆలోచించి, హృదయాన్ని చించుకోలేక నే, పరుగెత్తుకొచ్చాను. జనపదాలకి దూరంగా పారిపోయి, 'అంపం' మహాయోగ తపస్సులో, క్రూరజంతువుల క్రూరత్వాన్ని నిశ్శబ్ద భయానకతని సముద్రంలో బడబానలమల్లే కడుపులో పెట్టుకొని పాలించుకొంటోంది అడివిని...ఈ అడవి చూడాలనే తహతహే ఇంతదూరం లాక్కొచ్చింది!

తొలిసారి ప్రయాణానుభవంలో, నామీద నాకే జాలి, భయం, అసహ్యం, ఆవృతి — అనేక భావాలతో ప్రకంపించిపోయాను.

చారీబాబు కిటికీముందు కూచుని సిగరెట్టు పొగ వదులుతున్నాడు. అతనికళ్లు ఎవరికోసమో, వెదకు తున్నట్టు, నిరీక్షిస్తున్నట్టు కనిపిస్తున్నయ్!....

నాప్రయాణం పూర్తిగా నాకళ్ళకు కట్టుకొం టున్నాను......శృంగవరపుకోటనించి నిర్జనత్వం, అరణ్యం ఆరంభమైంది. అక్కణ్ణుంచి కారు వేగం కూడా శృతిమించిపోయింది!

కొండలు పిల్లగెంతు లేసుకుంటూ ముందుకు పోతున్నయ్! చెట్లు చేమలూ, మహావేగాన్ని తట్టుకో లేక, వెనక్కి విరిగి పడిపోతున్నయ్!...ఆ వేగంలో ఏదిశగా కొట్టుకపోతున్నానో అర్థంకాలేదు.

దూరపు కొండల నునుపు, ఆకాశంలో తల దాచుకోవాలనుకొనే శిఖరాలూ, వెర్రిగా పిచ్చిగా పెంచుకొన్న జడల్లా చెట్లూ చేమలూ తప్ప అడవిలో ఏముంటుందనుకొన్నాను.

ఊహలకి రూపందిద్దుతూ ప్రత్యక్షమైంది అడివి కారులో కూచున్నంతసేపూ, నాఅవస్థ నా ఎదురుగా కూచున్న ఆ అమ్మాయి ముసిముసినవ్వుల్లో మూలిగింది!

కారులోంచి తలబయట పెట్టి చూద్దామనుకుంటే ఝంఝామారుతవేగానికి, తల ఎగిరి ఎక్కడ పడిపో తుందో? మళ్ళీ తల వెదికి తెచ్చుకోడానికి కారాపు చేసి పరుగెత్తాలి!

'మీ రెప్పుడూ ఇదివరలో ప్రయాణం చేయ లేదా?' అంది ఆ అమ్మాయి. ఆవిడ కిప్పు డిది ఎన్నో అనుభవమో?...'నే నిదివరకెప్పుడూ ఈ ప్రాంతాలకి రాలేదండి!' అన్నాను. ఆవిడ పక్క కూచున్న ముస లాయన, తండ్రి కాబోలు నావైపు అదోలా చూశాడు.

ఆ అమ్మాయి ఏ అరమరికా లేకండా నిశ్చింతగా మాట్లాడసాగింది. అక్కడి ప్రకృతి విషయం...జాలా పుట్ లో దిగిపోతాంట! ఎక్కడో, ఏవో పల్లెటూరు చెప్పింది అక్కణ్ణుంచి, విశాఖ వచ్చినట్టు — మాచ్

ఖండ్ నుంచి, జాలాపుట్ కేంద్రానికి మారినట్టు — ఏదో సోదిలా చెప్పుకుపోతోంది...

గాలి ఆవిడ మాటల్ని ఏ అనంతదూరతీరాలకో మోసుకుపోతోంది. ఛటుక్కున ఒకచోట ఆగి:

'మీ కే(గ్రా)మం?' అంది.

'మీకు తెలీదులెండి! గజపతిరాజపురం అని మారుమూల కుగ్రామం' అన్నాను.

ఇంత మంచి పేరు ఏ మహాపట్నానికో ఉంటుంది కాని...అనే ఆవిడ భ్రమని నమ్మచేస్తూ...

'ఓహో! అదా?' అంది—

ఏదో తెలుసున్నట్టే!... మా ఊరి పేరు చుట్టు పక్కల ఉండే పట్నాలవారికే తెలియదు...

'మీ రీ పర్వత వాతావరణాని కలవాటుపడ్డవా రల్లేవుంది.' నా ప్రశ్న అందుకొని సమాధానంగా చిరునవ్వు చిందింది. చెక్కిళ్లు నవ్వినపుడు పడే గుంటల్లో హాసరసం నిలవచేసుకొని...వయసు ఇరవై దాటనివ్వలేదు అనిపించింది. కళ్ళలో చురుకుదనం, సంభాషణలో చాతుర్యం ఇట్టే ఆకడుతుంది!

కాస్త అలసటనిపించినపుడల్లా, ఆ ముఖంలో దేనికోసమో వెదికేవాణ్ణి...చిక్కని చిరునవ్వు పెదవుల్నించి రెక్కలు విప్పుకొని ఎగిరిపోయేది...

అలా ఎంతసేపు ప్రయాణం జేశామో...

సూర్యుడు నడినెత్తిన పొడుస్తున్నాడు.

'అదే అరకులోయ' అంది...'మల్బరీ చెట్లు, పట్టు పరిశ్రమ బాగా సాగుతుంది'...

బస్సు ఓ అరగంటన్నా ఆగుతుందిక్కడ.

ప్రకృతి బహిస్సౌందర్యవిశాలమైనదేదో, మానవుల దృక్పథాని కందనిచోట, దాని, ఏకాంత తపస్సు...

'ఆ చెట్టు క్రిందికి రండి! మీరు భోజనం తెచ్చుకొన్నారా? లేకపోతే, మాతో చెయ్యండి'

నేను తెచ్చుకొన్న ఆహార పదార్థాలతో చెట్టు క్రిందికి చేరాను.

'కారు వెళ్ళిపోతుందేమో?'

'మాచ్‌ఖండ్‌కి నడిచి వెడుదురుగాని లెండి!...' అంది నవ్వుతూ ... ముసలాయన లేకండా చూచి, 'ఏవండీ? వారు మీ నాన్నగారేనా?' అన్నా.

'ఆ సందేహం మీ కెందుకొచ్చింది?...' నవ్వబోయింది. విచారం మేఘంలా నవ్వు చుట్టూ కప్పేసింది.

'కాదు! నేను వారితో ఉంటున్నా ... అంటే పోషణలో ... ఆయన నీడక్రింద తలదాచుకొంటున్నా...'

నే నాశ్చర్యంతో క్రిందుమీదయ్యాను. ఐనా లోకానికి విరుద్ధం కాదుగా!

'ఇప్పుడు మీకు బాగా అర్థమైందా?...ఒక కంపెనీ విశాఖనించి, మాచ్‌ఖండ్‌కి సామాన్లు చేరవేయడానికి లారీలు కంట్రాకు చేసింది. ఆ కాంట్రాక్టు బేసిస్‌కి ఆయనగారిని మేనేజరుగా వేశారు కంపెనీవారు. అదీ సంగతి...'

'ఐతే మీరూ మాచ్‌ఖండ్‌కి రాకూడదూ?' అన్నాను. 'ఇప్పట్లో రావడం పడదులెండి! వస్తే, మీ ఆఫీసులో తప్పకండా కలుసుకొంటా'

ఆవిడ ఏ విషయంలోనూ మడిగట్టుకూర్చోలేదు. స్వేచ్ఛాహృదయంతో అన్ని విషయాలు తరచి తరచి మాట్లాడింది.

నేనే అంత చొరవగా చొచ్చుకుపోవడానికి సంకోచించాను.

కారు హారన్ మోగేసరికి ఉలిక్కిపడి లేచాను. వెళ్లి కారులో కూలబడ్డాం. చక్రాలు ముందుకు దొర్లాయి.

భావప్రపంచం ఒక్కసారి గుభిల్లున క్రిందికి దూకినట్టుంది అరకులోయ—ఎన్నాళ్లనించీ పర్వతాలిలా పతితమైన హృదయంలా, రాయిగా శపింపబడ్డ రాక్షసత్వంలా కొండవాగుల్ని కన్నీళ్లు చారికల్లా కట్టించుకొన్నయ్!...ప్రతిక్షణం ఒక మహామాయ ఉత్పన్నమౌతుంది ... ఉదయ సంధ్యా కిరణాల సువర్ణానికి కొండలు గీటురాళ్లు ... సౌందర్య మంతా శత్రువుల్నించి తలదాచుకొం దీ లోయలో...

'మీకు భావనాశక్తీ కావ్యశక్తీ ఉంటే, ఈ ఉదయసంధ్యల ప్రశాంతవాతావరణంలో, ఏకాంతంగాకూచుని, ఎటువంటి మహాకావ్యాలు వ్రాయగలరో, ఆలోచించండి!'

ఆవిడ అంటోంది—

'నీ చుట్టూ ఉన్న ఈ మహాప్రకృతిని చూచి ఆనందించలేని నీ బ్రతుకెందుకు?' అన్న సరోవరకవి వరుడ్స్‌వర్త్ మాటలు స్మృతిపథంలో మెరవకుండా ఎవరూ ఉండలేరు.

ఈ జన్మకీ జీవితానికీ ఇది చాలనిపించింది. లేలేతగా మబ్బుపట్టిన ఆకాశంలో నా హృదయం ఉవ్వెత్తుగా పొంగింది ఎటుచూసినా పచ్చని వాతావరణం కళ్లలో కాలుష్యాన్ని ప్రక్షాళిస్తున్నది.

అడవి గర్జిస్తోన్న క్రూరసత్వాల కంఠాల్లోనుంచి వినిపిస్తోన్న భయంకరధ్వానం, ఎప్పుడైనా దారి కడ్డంగా రావచ్చు...

'పగలేమంత భయంలేదండి! చిరుతలూ, సివంగులూ...' అవేమంత పెద్ద లెక్కలోకి రానట్టు చెప్పుకుపోతోంది.

అడవి విశేషాలు, జరిగినవీ, జరగాలిసినవి ఎవరి గొంతులోనుంచేనా వినిపిస్తాయేమోనని చూశాను. కాని, వాటి సంగతే పట్టించుకోన్నట్టు కనిపించలేదెవరూ...

ఐనా, ఈ అరణ్యసుందరి సౌందర్యాన్ని కాపాడ్డంకోసమేమో అనిపించింది క్రూరత్వం—

కొండల్ని పగలగొట్టి, ఇంజన్లు నడిపించి, ఇక్కడీ బాట ఏర్పరిచిన కార్మికుల రుధిర స్వేదధార ఇంకిపోయిన గుండెలమీదనుంచి పరుగెడుతోన్న కారు...

'ఇంత రోడ్డు ఎప్పుడు వేశారండి?' అని ఎవరేనా, అంటే 'అబ్బే ఏవుంది?' అని చప్పరించి, 'డబ్బండి...డబ్బు...కొన్ని కోట్ల రూపాయలీరోడ్డు మీద పారబోశారు' అంటారు.

ఎక్కడో వాళ్లు దిగిపోయారు.

చల్లని మంచినీళ్లెక్కడేనా దొరుకుతాయేమోనని చూశాను దాహంతో నోరెండుకుపోవాలేగాని...గుక్కెడు నీళ్లు దొరకవు.

'వేటు ది ఫారెస్ట్' అనే దయ్యాలంతలేసి ఇంగ్లీషు అక్షరాల, బోర్డు రాక్షసిలా వేలెత్తి చూపిస్తోంది మహామృత్యుమార్గానికి!...

ఫారెస్టు ఆఫీసులు చాలా కనిపించాయి దారి పొడుగునా...ఫస్ట్ గ్లేడ్, సెకండ్ గ్లేడ్...ఇవన్నీ అడవిలోకి చూపించేదారులు ... తిరిగి రోడ్డుమీదికి లాక్కొచ్చి వదిలే దారులు...

ఇదీ స్పష్టాస్పష్టంగా మనోఫలకంమీద గోచరమౌతున్న ప్రయాణానుభవం...

మాచ్‌ఖండ్‌లో అడుగుపెట్టేటప్పటికి, ఐదు దాటుతోంది!

కక్కుతోన్న అరుణరక్తంతో తడిసిపోతున్న కొండలు...ఆయాసంగా కసురుస్తోన్న ప్రకృతి... చీకటిముసుగు పైకి లాక్కోవడానికి ప్రయత్నిస్తోన్న ఆకాశకాంత...ముసుగును తొక్కిపట్టుకొంటోన్న పర్వతాలు...లోయలోకి దిగజారిపోతోన్న కాంతి వసనాలని, సిగ్గుతో పైకి చేదుకొంటోన్న ప్రకృతిశ్రీ..

ఒళ్లంతా కుదుపు, గాలివేగం...ఎండాకొండనక చేసిన ప్రయాణం .... నరాల్లో ఘనీభవించిన రక్తం ... వీటన్నిటినించీ విముక్తి పొందడానికి... విశ్రాంతి కావాలి!

ఆఫీసులో నా ముఖం కనిపించింది చిందరవందరగా...రెమింగ్‌టన్ మిషనుముందు టకటక వ్రేళ్ళని నృత్యంచేయిస్తున్న శాస్త్రి, నావైపు అదోలా చూశాడు. ఆఫీసు ఎకవుంట్లలోనుంచి, జ్వాలానరసింహం తలెత్తిచూశాడు.

దాంతో పదిజతలకళ్లూ పలకరించాయి.

'మాతో భాగం పంచుకోవచ్చిన జంతువువా?' అన్నట్టు.

'ఈ అడవిలో చావుబ్రతుకులమధ్య అల్లాడిపోతున్న మాతో ఈ పోరాటానికి నీవూ భాగస్వామివా?'

'మానవప్రపంచానికి, నూటయాభయిరెండు వందలమైళ్లదూరంలో ప్రకృతిని సాధించి, విశ్వోపకృతికోసం విద్యుత్తు పుట్టించేందుకిక్కడ యోగతపస్సులో ఉన్నాం.'

అన్నికళ్లలోనుంచీ అన్నిప్రశ్నలూ, ఓదార్పులూ, నిట్టూర్పులూ వెలువడుతున్నయ్!...

నా కళ్లు తిరుగుతున్నయ్! నిలబడలేకపోయాను. శాస్త్రి వచ్చి చేయిపట్టుకొన్నాడు.

'కళ్లు తిరుగుతున్నాయా?'

'ఊహుఁ'

'మీ అమ్మా నాన్నా రానిచ్చారా?....పాపం! నౌకరీ...రానీకేం చేస్తారు?'

'మీరంతా ఉన్నారుగా! మీతోపాటే నేనూ'

'నీకు ఆర్డరు టైపు చేసింది నేనే!'

గర్వం కళ్ళల్లో తొణికిసలాడింది.

'మా అమ్మా నాన్నా వెళ్ళమని పోరుపెట్టారు. మీరు కొండశిఖరంమీదనుంచి వేసిన కేక వినిపించింది. నేను రెక్కలు గట్టుకవాలాను. దారిలో, ఏం అడవిరా భగవాన్! అనిపించింది.'

'ఇక చాలించు. అక్కణ్ణుంచి మహాప్రయాణం చేసి వచ్చిన ప్రతీవాడికి పిచ్చెక్కుతుంది అందులో సందేహం లేదు'—అని.

'ఇంజనీరుకీ, ఆఫీసరుకి ముహం చూపించావా?' అన్నాడు.

'ఇంకా లేదు. ఇప్పుడు నేనెవర్నీ చూడను!... బడలిక—అలసట పోయేలా నిద్రపోవాలి!'—

అఫీషియల్ క్వార్టర్సులోకి దారితీశాం.

అప్పుడే చారీబాబు ముఖం చిరునవ్వుతో సాక్షాత్కరించింది!

## 2

'ఏమిటి? దీర్ఘాలోచనలో పడ్డట్టున్నావు? నిద్ర పోతున్నావా?' చారీబాబు కుర్చీనించి లేచొచ్చి, నేను నెమరు వేసుకొంటున్న స్మృతిపథాల్లోనుంచి మేల్కొల్పుతూ అన్నాడు...

'ఇక్కడి కెలా వచ్చిపడింది... జ్ఞాపకంలో....'

'నిద్రపో! అనవసరంగా మెదడుకి పని చెప్పకు.' ఫ్లాస్కులో బార్లీ, గ్లూకోజు కలిపి ఇచ్చాడు.

'మీ కనవసరంగా శ్రమిస్తున్నాను. మీ ఋణం...'

నా కళ్ళలో నీరసంగా కృతజ్ఞత మెరిసింది...

బార్లీ తాగడానికి వెగటనిపించింది. ఐనాతప్పదు.

'ప్రొద్దుట్నుంచీ, నారింజకోసం తిరిగాను... ఎక్కడా...'

'చారీబాబు! నిన్ని అడవిలో, నా కోసమే దేవుడు పడేశాడు.' ఆపత్కాలంలో, ఆర్తహృదయం నించి వెలువడేమాటలే నా నోటినించి వెలువడుతున్నయ్... కాని, చారీబాబుకి అవి వినడమంటే, ఇష్టంలేదు. అది మానవధర్మంలో శతాంశమాత్రమె? నేను చేయగల్గిం దేవుండి? నీ కన్నీళ్ళు తుడవడాన్ని ప్రయత్నిస్తున్నా, అంటాడు చారీ.

నే నొకందుకొస్తే, ఒకందుకయింది...

శాస్త్రి, జ్వాలా నరసింహం ఆగుకుంటూ రను కొని వచ్చినవాణ్ణి ఈ చారీబాబు కళ్ళలో మెదిలి పోతున్నా.

'ఏదో ఉద్యోగం చేసుకోనీకండా, ఈ జ్వరం నీ మీద నే పగసాధించాలీ? నువ్వొచ్చి నెలదాటిందా? కర్మ...'

అంతా కర్మసిద్ధాంతంమీద ఆధారపడి వున్న మానవత, అభ్యుదయం ఏంసాధించగలుగుతుంది?...

చారీబాబు ముఖంమీద చిరునవ్వునీడలో ఒదిగి నిలుచున్న మధురస్మృతి ప్రణయం మెరుపుల్తో నాలో కలవరించింది—

'మా వాళ్ళకి ఉత్తరం రాయాలి! కాగ్దంటే తెచ్చి పెట్టు చారీబాబూ!'

నా పరిస్థితి కాస్త ఇంటికి తెలియజేదామని...

'రేపెలాఐనా, విశాఖ పోతాంగా! అక్కడ ఎలా వీలైతే, అలా చేసుకోవచ్చు. అసలే కంగారు పడి పరిగెత్తుకొస్తారు... బోలెడంత ఖర్చు... ఎవడు తిన్నది?'—

'నా జీవితంమీద ఇంత ప్రభావం ప్రసరిస్తుం దనుకోలేదు నీ పేరు! చారీబాబు అనే నీ పేరు నా శిలాహృదయంమీద చెక్కుకోడానికిప్రయత్నిస్తాను.'

'కొంచెంసేపు విశ్రాంతి తీసుకో! నేను వెళ్తున్నా.' బయటేదో చప్పుడైంది. చారీబాబు చీకట్లో కలిసిపోయాడు. తర్వాత నల్లనినీడ అతన్ని వెంటబెట్టుకొని పోయింది. ఆ నీడలో ఏ కోరిక దాక్కుందో ఎవరికీ అర్థంకాదు!...

ఒక నిట్టూర్పు విడిచాను... నీ హృదయం మహోన్నతమైన శిఖరమే కావచ్చు. కాని చారీబాబు! అది నేనెక్కలేను. జారి అధఃపాతాళానికి కృంగిపోతాను! దానిచుట్టూ తాండవిస్తున్న చీకటిలోమాత్రం నీకెన్ని దూషణలు వినిపిస్తున్నయో! వాటన్నింటినీ సిగ్గుతో, చీదరతో పెదవులమీదినవ్వుతో తుడిచిపారేస్తావు... నీతో వెళ్ళిపోయిననీడతో నీకేమిటి చీకటిసమస్య?...

* * *

మెదడు మళ్లీ గతంమీద పొదగడం మొదలు పెట్టింది—వెళ్లీ వెళ్లడంతోనే, రూపాయణా పైసలు కూడికలూ తీసివేతలూ ముందు పారేశారు! నాటితోనే సాయంకాలంవరకూ. శాస్త్రి రెమింగ్టన్ మీద అక్షరనృత్యం చేస్తూ భావసౌందర్యం ప్రసరించేవాడు. జ్వాలా నరసింహం, డిస్పాచింగ్ క్లర్కు...ఎంత పాషింగయినా అతని చేతిమీదనుంచి జారుకోవాలిసిందే!

ఇక చారీబాబు! కొండజాతివాళ్లతో పని... వాళ్ళచేత త్రవ్వించడం, పూడ్పించడం ..ఆమట్టిలోనించే ఏదో పుట్టించడం—

ఇక్కడేవో గనులున్నాయట...పరీక్షించడానికొస్తుంటారు అనేవాడు చారీ!...

'నిన్ను డుడుమాజలపాతం దగ్గరికి తీసికెడతా'.. అనేవాడు—ఈక్షణంవరకూ పడలేదు. ఇక్కడికి రెండుక్రోసుల దూరమున్నా వుంటుంది...దారంతా అడివి...ఒక్కడూ బిక్కుబిక్కుమంటూ వెళ్లితే, ఇంక తిరిగిరాడు. ఏ క్రూరజంతువూ మీద పడనక్కర్లేదు. భయంలోనించే, అతనిమృత్యువు పుడుతుంది—

ఒకఆదివారం అంతా కలిసి వెళ్లాలనుకొన్నాం. దొరగారిదగ్గిర తుపాకి పుచ్చుకొంటానన్నాడు చారీబాబు!... ఇంతలోనే, నన్నీపిశాచం ఆవహిస్తుందనుకోలేదు!...

ఆఫీసరుకూడా నాపట్ల ఏదో అవ్యాజమైన అనురాగంతో ఉండడం నన్ను మరింత ఉత్తేజపరిచింది. 'పాపం అనారోగ్యంగా ఉండి, ఈ వాతావరణాన్ని తట్టుకోగలవా?' అని జాలిపడ్డారు. నాకు తప్పలేదన్నాను. తల్లీ, దండ్రీ అనుభవిస్తున్న నికృష్టదశ, నా యీవుద్యోగం—అంతా ఒక అంతర్నాటకంలా వుంది, నాకు!—'మా యింట్లోవాళ్లు ఆనందబాష్పాలు రాల్చారు నా యీఉద్యోగానికి' అని సిగ్గుపడుతూ అన్నాను అందరితో—

ఒకరోజు నా గదిలోకూర్చుని, నా అదృష్టాన్ని పొగుడుకొనే పదాలు వెదుక్కుంటూంటే, నాకళ్లు ఆనందంతో నృత్యంచేశాయి. ఏ అదృశ్యహస్తాలో నాకళ్లు తుడవడానికి క్కాబోలు చూచుకుంటున్నాయి—

నాగొంతులో సుడితిరుగుతోన్న సంగీతం ఒక్కసారి పెల్లుబికింది. అప్రయత్నంగా ఏకొండసానువులోన్న ఒరసుకొని ప్రవహించసాగింది...

అప్పుడే తనగదిలోకి వెళ్లిపోబోతున్న చారీబాబు నాదగ్గరకొచ్చి కూలబడిపోయాడు.

'హిందీపాట లేవయినాఉంటే పాడండి! నామత్తు వదిలిపోతుంది' అన్నాడు ఇంగ్లీషులో...అతనేంమాట్లాడినా, ఇంగ్లీషులో, పోతే హిందీలో—

'మీ కంఠంలో వినబడుస్తున్న గానం. సైగల్ ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తుంది'—

బైజూబావరాలో సంగీతం విని తన్మయుం పొందాడు.

'మీరు గాయకులని నాకు తెలీదే? సంగీతానికి నాప్రాణం ధారపోస్తా—ఆఖరికి పెద్దపులి గాండ్రింపులోనూ నాకు సంగీతం వినిపిస్తుంది'

'పెద్దపులి అరుపా? ఐతే ఏపలకమీదనా గాజుపెంకుతో చేసే, గరగరశబ్దం మీరు వినగలరా?'

'అబ్బ...ఒక్కక్షణం భరించలేను ఆగరగర...?

మీరు సాహిత్యంలో, ఏవేనా, చదువుకొన్నారా? కనీసం అభిరుచన్నా...?

'అలాంటిదేం లేదు...'

'మీరు శరత్ పేరు విన్నారా? మీ బెంగాలీ తత్త్వాన్ని కాచివడపోసిన మహారచయిత...విశ్వజనీనమైన ఆ తత్త్వం మా తెలుగులో చదివి, తెలుగువాడే అనుకొంటారు'—

'ఆయన పేరు విన్నానుగాని, ఏంచదవలేదు! అంత గొప్పవాడా?

ఆశ్చర్యపోయాను. తమ దేశీయసాహిత్యంలో రచయితయొక్క స్థానంగుర్తించని, జాతీయుడొకడున్నాడంటే...

ఏం ఎందుకుండరూ? అందరికీ కావాలేమిటి? ఈపాటి మీమాంసలూ, సాహితీప్రశంసలు...అనిపించింది...

ఏజాతి తన జానపదసాహిత్యం, సమకాలీన సాహిత్యప్రభావంలో భాసిస్తున్న వ్యక్తుల్ని గుర్తించలేదో, దానికభ్యుదయ మెక్కడ సాధ్యం?...

పెద్దపులిగాండ్రింపులో సంగీతం వింటోన్న చారీబాబు, పలకమీద గరగర వినలేక నరాలు కుంచించుకు పోతాయి. ఐనా, శరత్తుని చదవేలేనంటాడు... దానిమీద అభిరుచి లేదన్నట్టూరుకొన్నాడు. ఆ అభిరుచి ఎందుకులేదో ఎవరిని ప్రశ్నించడం?...

అప్పట్నుంచీ, చారీబాబుకీ నాకూ పరిచయం పెనవేసుకుపోయింది. సంసారసారం తెలిసిన మనిషి... చిత్రమైన వ్యక్తి...ఇతనితో నాకేమిటి స్నేహం?... అతని వ్యభిచారం చూస్తే తల పగిలిపోతుంది...ఎంతసేపూ దహించే కోర్కెతో వేదనపడే వ్యక్తి.

'మీరెందుకు పెళ్ళిచేసుకోలేదు ?' ఒకనాటి నా ప్రశ్న...

'బజారులో అన్నివస్తువుల్లాగే అదీ దొరుకుతుంది కనక' అంటూ పకపక నవ్వేశాడు.

తర్వాత బాధగా నిట్టూరుస్తూ, 'నాకెవళ్లూ లేరనుకోకు! మా దేశంలో నాకోసం. ఒక ప్రియురాలు ఎప్పుడూ ఎదురుచూస్తూ వుంటుంది! ఎప్పుడు వెళ్ళినా నాపాదధూళి తీసుకొంటుంది. ఏదో సంసారం చేసుకొంటోంది. భర్త తాగుబోతు...ఆమధ్య ఒక మగపిల్లవాణ్ణి కన్నట్టు తెలిసింది. పిల్లవాడికి ఆశీస్సులతో కొంతడబ్బుకూడా పంపాను...డబ్బుకిబ్బందిగా వున్నప్పుడు ఉత్తరం రాస్తుంది. మా అగర్వాల్ ద్వారా... ఆయనకే డబ్బుపంపిస్తా...అగర్వాలంటే మా వేలు విడిచిన మావయ్య...ఆవిడ భర్తకీ నాకూ చిన్నప్పట్నుంచీ ప్రబలశత్రుత్వం...ఆ పగ ఏనాటికైనా సాధించాలి! ఐతే, నా ప్రియురాలి ఆటంకం కన్నీళ్లు, మాంగల్యం...'

'ఆవిడ వ్యభిచరించిందా నీతో ?' అన్నాను. కళ్లలోకి సూటిగా చూస్తూ.

ముఖం చిట్లించుకుని, అసహ్యంగా చూస్తూ, 'ఛీ! నీకిదా అర్థమైంది ? నీనోట ఆమాటనాలని ఎలా అనిపించింది ?' అన్నాడు.

నాతల క్రుంగిపోయింది, అలా భావించుకొన్నందుకు—భర్తవున్నా తనతో ఏదో ప్రేమ నటిస్తుందట! అక్కడికివెళితే ఒక్కరోజన్నా గడపకుండా గడప దాటనివ్వదట ?...ఏవిటీమాటలు ? అది వ్యభిచారం కాదంటాడు...తన ప్రియురాలు మహాపతివ్రత!

నాముఖంమీదికి నవ్వు తోసుకొచ్చి, చారీబాబుని చూడగా నల్లగా మాడిపోయింది ?

'అతనితో స్నేహం ప్రమాదంసుమా!' శాస్త్రి, జ్వాలానరసింహం హెచ్చరిక చేశారు! నాకు తెలుసు—అందులో స్వార్థం—ఐనా, నేనంత అజాగ్రత్తగా లేను! నావల్ల చారీబాబుకైతే, వ్యయమే గాని, లాభం లేదు!

## 3

పదిరోజులకి ఉత్తరం వచ్చింది ఇంటిదగ్గర్నుంచి. ఏ పరిస్థితిలో ఇల్లు వదిలిపెట్టి వచ్చిందీ అప్పటిగ్గాని నాకు గుర్తురాలేదు. పండక్కి ఇంటికొచ్చిన అక్కయ్యమెడలో వస్తువులు తాకట్టుపెట్టి నన్ను సాగనంపారు ఉద్యోగానికి!

ఈ ఉత్తరం చూసేసరికి హృదయం చివుక్కుమనిపోయింది. మానవుల్లో ఇంత నీచానికొడిగట్టే దానవత్వముందా ? అనిపించింది. నాన్న వ్యంగ్యంగా వ్రాసినవాక్యం కొట్టొచ్చినట్టు, ఉత్తరాన్నంతనీ దహిస్తున్న ఆర్థికాభ్యర్థనతో నిండిపోయింది జీతాలు రావడానికింకా ఇరవైరోజులు పనిచేయాలి! ఈలోపులో అక్కడి పరిస్థితులు తారుమారయితే...

నేనా ఉత్తరం పట్టుకొని, శాస్త్రి, జ్వాలానరసింహాలదగ్గరికి పరుగెత్తాను. మా బావని నిందించడం తప్ప వాళ్ళు చేయగలిగిందేమీ లేకపోయింది! పెదవి విరిచారు! 'ఏభయి రూపాయలు సహాయం చేయడమంటే మాటలా ?'...

వాళ్లముందు ఒక్క క్షణం నిలదొక్కుకోలేకపోయాను. డబ్బుండికూడా ఇవ్వలేని దుస్థితిలో వున్నారు? పాపం!...'వీడికిస్తే, తిరిగివ్వకపోతే, మనగతేం కావాలి ?' అన్న ధోరణిలో వున్నారు.

ఎవరేనా, ఈ సమయంలో ఏభయి రూపాయలిస్తే, కొండశిఖరంనుంచి, లోయలోకి పతనమైపోవడానికి సిద్ధంగా వున్నా. ఏకాంతంలో ప్రత్యక్షమై భగవంతుడు, 'ఏభయి రూపాయలు తీసుకొని, నీ అవసరం గడుపుకో! నేను ప్రత్యక్షమైనట్టు ఎవరికీ చెప్పకు' అని చెప్పినా, నేను సిద్ధంగా ఉన్నాను కాని, ఏది ? ఏదీ జరగదు!

నా కాలెక్కడికి సాగిపోయిందో. ఊరు కొద్దిగా దూరంలో కనిపిస్తోంది. పడమటికొండపై అందాలు!...

స్వర్ణారుణ కిరణాలు కరిగించిన, కొన్ని కోట్ల రూపాయల విలువచేసే, బంగారం కొండలకి పూత పెడుతోంది. మిగిలింది పర్వతాంచలాల్నుంచి జారి లోయల్లో ప్రవహిస్తోంది! ఈ దృశ్యాలు చూసి, ఆకలి దప్పుల్లేకుండా ఆనందించవచ్చు...

నేనలాగే ఓ పెద్దగుట్టమీద నిలిచి చూస్తున్నా. ఆకాశంలో తలదూర్చి మేఘాల్ని చీల్చి పారేస్తోన్న చెట్లూ, కొండకొమ్ములూ తప్ప వేటితో స్నేహం?...

నాదృష్టికి కింగుగా, అల్లంత దూరంలో రెండు విగ్రహాలు కనిపించాయి నన్ను రమ్మని సైగ చేస్తూ...

దూరంనించే పోల్చుకొన్నా చారీ బాబని... పక్కనున్న నల్లని నిగనిగలాడే విగ్రహం ఎవరో దగ్గరకు చేరితే నేగాని తెలిసింది కాదు!....

ఆ నల్లని విగ్రహం చూపులు నల్లగా, నాకళ్లని ఢీకొని తూలిపడ్డాయి, కొండవాగు తరంగాల్లో—

ఆ విగ్రహం అక్కడుండడానికి సందేహించాను—

'ఈ విగ్రహం ఎవరూ?'

'ఇక్కడే కొండవాళ్లు... కాని వాళ్ల నీచత్వమూ మొరటుదనం లేని మనిషి... ఆ కళ్లలో నీకేం సౌందర్యం కనిపించడం లేదూ? అందులోనుంచే, హృదయాన్ని తొంగిచూడవచ్చు......' అన్నాడు చారీబాబు

'పూసల పేరులూ, అవీ లేవేం? కొండదానిలా లేనే లేదు. ఏదో శాపం అనుభవిస్తున్న...'

'నిజం...నీవు చెప్పింది అక్షరాలా నిజం... ఒక దేవకన్య అనుకో'

ఈ విగ్రహానికి సిగ్గు బిడియా లున్నాయా? దయాదాక్షిణ్యాం కడుపులో ప్రేవులూ అంటూ ఉన్నాయా?...నిగనిగ లాడుతూన్న వళ్లు....పుష్టిగా ప్రతీ అవయవం చుట్టూ సుడి తిరుగుతోన్న యౌవనం. కొండల్లోనుంచి పుట్టిన సెలయేరులాంటి కన్య...... హాయిగా ఆహ్వానిస్తోన్న వయసు...

'అందరిలాంటిది కాదుకా దీ రీటా...రీటా అంటే నేను పెట్టిన పేరు......ప్రభుత్వానాణెం చూసే సరికి, వీళ్ల కళ్లు మిలమిల మెరిసిపోతాయి. దాంతో ఏది కావలసినా ధారపోస్తారు'

'నాకు పులిగోళ్లు కావాలి తెచ్చి పెట్టమను— ఎంత కావలిస్తే అంతా ఇస్తా' నా చేతిలో కాగితం రెపరెపలాడింది—

'ఏమిటా ఉత్తరం?'

చారీబాబు దృష్టిలో పడిన ఈ ఉత్తరం మోక్షం పొందుతుందేమో? చిన్నప్పట్నుంచీ ఎరిగున్న శాస్త్రీవాళ్ళే పెదవివిరిచినపుడీ చారీబాబు నా అనామకత్వానికి ఏభయి రూపాయలు ధారపోని కన్నీళ్లు తుడుస్తాడా?... ఈ ఉత్తరంలో మా పరువు ప్రతిష్ఠలకి భంగంకలిగే, వ్యవహార మేదీనా ఉంటే ఎంత సిగ్గు?—

ఉత్తరం చదివి అర్థం చెప్పాను.

'ఇక్కడ క్షేమంగా ఉన్నామని, అబద్ధం చెప్పడం నా కిష్టం లేదు. నీవు వెళ్ళినప్పట్నుంచీ మరింత ఇంట్లో అయోమయం—అక్కయ్యని తీసుకెళ్లడానికి బావ వచ్చాడు. దాని వంటిమీద నగల కోసం నిర్బంధించాడట! తమ్ముడికి నెల జీతం రాగా నే పంపిస్తా డూరుకోండంతవరకూ అందట— ఆ నగలు, నీ ప్రయాణానికి తాకట్టు పెట్టినట్టు నాకు తెలియకపోలేదు. అక్కా బావ దెబ్బలాడుకొన్నారు. బావ అనరాని మాటల్తో అక్క గుండెని గాయపరిచాడు. ఆత్మాభిమానంగల ఆడబిడ్డ నూతిలో పడబోతే పట్టుకొన్నాం. మన ఇల్లంతా హోరు మని ఏడ్చింది. బావ ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. అక్కయ్య నగల్ని విడిపించడానికి ఏభయి రూపాయిలు కావాలి!'—

'ఐతే, డబ్బెందుకు మనియార్డరు చేయలేదు నీవింకా?' అన్నాడు చారీబాబు.

'నా దగ్గరుంటే ఇంతసేపా?'

'నీ దగ్గర లేకపోతే, నా దగ్గరుంటుంది. అడగడాని కంత అభిమానపడ్డావా?'

'మీ దేశం పంపాలనుకొన్నావని...'

అతని అభిమానానికి దుఃఖం పొర్లుకొచ్చింది.

'దేశం మాట దేవు డెరుగును. మీ అక్కయ్య ఆత్మాభిమానంతో దహించుకుపోతోంటే, దహనం చల్లార్చుకోడానికి నీళ్లదగ్గిరికి పరుగెత్తింది...మీ బావ నైచ్యానికి ఆహుతి కావలసిందేనా? అలా ఎప్పటికీ జరగూడదు.'

మా మాటల్లో అర్థభావాల్ని గ్రహించేందుకు రీటా కళ్లు ప్రయత్నిస్తున్నయ్! ఆ కళ్లలో, మిల మిల మెరిసే తారకలు, ప్రకృతిని మండించినపుడు రెండు అగ్నికణాలు, ఆ నేత్రాలలో స్థానం ఏర్పరచుకొన్నాయా అన్నట్టు—

నాలో తీరిపోయిన సమస్యానందం...రీటాలో సౌందర్యాన్ని అన్వేషించేందుకు పూనుకొంది.

'బయల్దేరు. ఒకవేళ పోస్టాఫీసు తెరిచివుంటే కట్టేద్దాం' అని చారీబాబు లేచాడు. రీటా కూడా ఏదో ఆలోచిస్తున్నదల్లా లేచింది. నేను ఉక్కిరిబిక్కిరిగా లేచాను.

నిస్వార్థమైన ఒక మానవ హృదయం నాలో గంటలు కొడుతోంది

రీటా తీస్తోన్న పరుగులో రమిస్తోన్న వాంఛాతప్తమైన సౌందర్యం, ఏదో చెప్పలేని, ఆకర్షణ— నన్ను ముందుకు లాక్కుపోతోంది. చారీబాబు నేనూ, ఒకడుగు వెనకముందులో ఉన్నాం.

అడవిలా పెరిగిన అందం, నునుపుదేరిన కొండల బరువు మోస్తోన్న వయస్సూ, నరాల్లో ప్రవహిస్తున్న వాంఛాతప్తమైన రక్తం—వీటన్నింటితో ఇదో స్త్రీ! పర్వతకన్య—

చారీబాబుతో రీటాని గురించి, ఏదో అశ్లీల భావం స్ఫురించేలా వ్యంగ్యంగా అనాలనిపించింది. కానీ అతనికీ, రీటాకీ ఏదో ఆంతరంగికం—అవినాభావం—ఉన్నట్టుంది. అంటే బాధపడవచ్చు. అని ఊరుకొన్నాను. అతనావిషయం మరెత్తనూ లేదు.

కొండకన్యలు మెల్లగా చీకటిముసుగు పైకి లాక్కుంటున్నాయి. చేతిలో చిన్న బ్యాటరీ లైటుతో చారీ ముందు దారితీస్తున్నాడు.

'అర్ధరాత్రి చీకటిపడ్డాక, ఇక్కడికి రావడానికి పడేభయం ఎంత మహోదాత్తపరిమాణంలో వుంటుందో నీవూహించగలవా? అలాంటి భయం అనుభవించి, రక్తం నరాల్లో గడ్డకట్టుకపోయి, ఏ లోయలోనో కూలిపోవాలిసిందేగాని, తిరిగి రాడు'—

'ఊళ్లో కప్పెప్పుడు పెద్దపులు లొస్తాయటగా! నిజమేనా?'

'నిజమే! ఎప్పుడేనా వస్తాయి—కిందటి సంవత్సరం ఒక చిఱతపులీ, పులీ వచ్చినట్టు చెప్పుకొన్నారు. వస్తే ప్రాణాలతో తిరిగి వెళ్ళవుగా!' అన్నాడు చారీబాబు.

దారిలో మరింక విశేషమైన సంభాషణేం జరగలేదు—

బజారు కొచ్చేశాం—

విద్యుత్కాంతిలో మునిగిపోయిన ఊరు, దూరానికెలా కనిపిస్తుందో?......విద్యుచ్ఛక్తిని మంచినీళ్లప్రాయంగా వాడ్డమే ఇక్కడ పని—

కిళ్ళీ కొట్టు దగ్గర సోడా తాగడానికి ఆగాం, పోస్టాఫీసుకు నడవమన్నాడు చారీబాబు.

## 4

చారీబాబు అందించిన చేబదులుతో, ఒక సమస్య ఎత్తుకుపోయింది. అక్కయ్య ఇంకెప్పుడూ నూతిలో పడానికి పరుగెత్తదని ధైర్యంగా గుండెలమీద చేయి వేసుకొన్నాను. స్త్రీ స్వభావంలోని చపలత్వం ఆదినించీ గమనిస్తూనే వస్తోంది ప్రపంచం. ఏదీ లేకపోతే, కన్నీళ్ళతో పురుషహృదయంలోని కార్కశ్యాన్ని కరిగించేశక్తి వుంది!...

చారీబాబు, ఆర్థిక సహకారం, శాస్త్రి, జ్వాలానరసింహాలలో చైతన్యం రేకెత్తించింది. 'మేమూ చేద్దుంగాని...' అని నసిగేశారు. వాళ్లలో సజాతీయత దెబ్బతింది. నా కన్నీళ్లు తుడవడానికి ప్రయత్నించారు. విజాతిధ్రువాలు ఆకర్షించుకొంటాయిగాని అయస్కాంతంలో సజాతిని ఆకర్షించుకోవుగా! ఆధర్మం మానవత్వంలోనూ ప్రసరించాలి కాబోలు!

వర్థిష్ణులైన మాయిద్దరిస్నేహం అందరికీ కన్నెర్రగా వుంది. చారితో అంత విపరీతమైన స్నేహం మంచిదికాదుసుమా! అనే సలహాలు హెచ్చరికలూ వినిపించసాగినయ్. ఐనా, నేనంత పట్టించుకోలేదు. అది ఈర్ష్యతాలూకు భావస్వరూపం అనుకున్నాను.

'అతనితో స్నేహం చేసిన వాళ్లు రోగాలూరొచ్చులతో పతితమైపోయారు' అని ఉదాహరణలు చూపించారు.

ఒకరోజు దెయ్యాలవిషయం ప్రస్తావనవచ్చింది. 'మనతో కాపురం చేస్తున్నాయి అవికూడా. అదృశ్యహస్తాలతో అవీ మిషన్లూ అవీ తిప్పుతున్నయ్! అర్ధరాత్రి భయంకరంగా చేసేచప్పుళ్లు వాటిప్రభావమే!' అన్నారు.

'ఇదంతా ఎక్కడపుట్టిందీ?' అనడిగాను.

'చారీబాబు క్వార్టర్సులో! అతని మకాం అక్కడే!' వెంటనే చారీదగ్గరికి పరుగెత్తాను.

'ఏమిటోయ్? ఆఫీసులో దెయ్యాల సంగతి?' అన్నాను. సమాధానం చిరునవ్వుతో సరిపుచ్చాడు.

'ఈ మహారణ్యంలో దెయ్యాలూ, దేవతలూ లేకుండా ఉంటాయా? విద్యుత్తుతో ఇవీకూడా పుడుతున్నట్టుంది. మానవులకీ వాటికీ, ఏదోగొప్ప సంబంధం వుండివుంటుంది. నా గది పక్క వసారాలో పెద్ద బండరాళ్లు గుభిల్లున పడుతూండేవి. అంతా వికావికలై పారిపోయారు. వాటి విషయం నే నంతు తేల్చుకోవాలని అక్కడే వున్నాను. అంతగా కావాలనుకుంటే ఒకరాత్రి రా!'

'ఐతే స్వార్థపరులైన మానవులు కల్పించిన కల్పన కాదంటావా?'

'అది నీ ఊహాకే...!'

ఎవళ్లకవసరమైతే వాళ్లు సృష్టించుకుంటారు. అసలీదెయ్యాల్ని చూసి నిర్ధారించిందెవరు? అంతా కృతకం, నటన...అనిపిస్తుంది.

తర్వాత ఆప్రసంగం మళ్ళీ ఎత్తలేదు.

ఎలాంటి అరమరికలూ లేకుండా స్నేహం సాగుతోంది. ఆఫీసు వ్యవహారాలు సక్రమంగా ఉన్నాయి. ఇంటిదగ్గర్నుంచి ఉత్తరంకూడా వచ్చింది. క్షేమసమాచారాలతో...కష్టసమయంలో సహాయం చేసిన చారీబాబుకి కృతజ్ఞతాపూర్వకవందనాలు సమర్పించింది మాకుటుంబం—

అప్పుడప్పుడు కొండలమీదికి షికారు వెడుతూ నేవున్నా ఒంటిగా. రోజూ ఏదో కొత్తందం గోచరించేది. గాలిపాడే, సన్నని ఆకుల్ని కోసుకుపోతూన్న ఈలసంగీతం—రంగురంగుల పక్షులు... పేరూ ఊరూ లేని మొక్కలూ చెట్లూ...

నిశ్శబ్దసౌందర్యాన్ని గాలిద్వారా పీలుస్తూ కొండవాగుల జలజలల్లో హృదయం కొట్టుకుపోతూ వుంటే చూస్తూ ఎన్ని సంవత్సరాలైనా గడపవచ్చు. ఈ సౌందర్యం వయసెంత?...దీన్నెన్నాళ్లిలా అనుభవించవచ్చు? అనుభవించేకొలందీ మెరుగులుతీరే ముగ్ధమోహనస్వరూపం ప్రకృతిది...

మేఘాలు కమ్ముకొన్నపుడొక అందం. వర్షించబోయేముందు ఒకఅందం. క్షణక్షణ పరిణామలావణ్యాల విస్ఫూర్తితో విస్తరిస్తున్న ఈప్రకృతి, మేఘకేశాల్ని వర్షస్నానానంతరం ఆరబోసుకొనేటప్పుడు నగ్నంగా వున్నపుడు సిగ్గుతో పులకలెత్తి కట్టుకునే పచ్చిక పట్టుచీరల్ని, చీకటి ముసుగుల్ని, వెన్నెల ముసుగుల్ని పర్యాలోకిస్తూ, లీనమైపోవాలనిపిస్తుంది, ప్రకృతి అమృతహృదయంలో—

అడపా దడపా, రీటాకూడా ఏకొండలమీదో దూకుతూ లేస్తూ కనిపించింది. రకరకాలుగా ప్రసవిస్తూన్న దృగంతాలకి వైవిధ్యవర్ణాలలో ప్రత్యక్షమయ్యేది!

నిశ్చలమైనవాగు.

ఆవాగుముందు నేను. పర్వతపాదంలో నుంచుని చూస్తున్నాను. నీరు ఓదోసిలిలో పోసుకొని పుక్కిలించాను. చప్పగా జిగురుగావున్నాయి. చూడ్డానికి స్ఫటికంలావున్నాయి నీళ్లు. దాహంకూడా వేస్తోంది. కొద్దిగా దోసిట్లో పోసుకు తాగాను. మళ్లీ దోసిట్లో పోసుకు తాగబోతున్నా. పైనుంచి గబుక్కున ఓ కంకరరాయి పడింది దోసిట్లో. పారబోసి పైకి చూశాను. రీటా!...పైనుంచి, సైగ చేస్తోంది తాగొద్దని.

నా దాహం మరింత ఎక్కువయ్యింది.

గుట్టలమీదనుంచి జారుతూ, లేస్తూ దిగివచ్చింది. నా వైపు ఆశ్చర్యక్రోధాలతో మింగేలా చూసింది.

'చారీబాబు నీతో రాలేదా?'

రాలేదంది వాళ్లభాషలో. ఆభాష నాకర్థమైచావలేదు. ఏదో వాగుతూపోతోంది. కళ్ళలో మిలమిల మాత్రం కనిపించిందంతే! వంటిమీదిరంగు చేతికంటుకొనేంత నల్లగావుంది నిగనిగ మెరుస్తూ...

కనురెప్పకాలంలో వాగులోకి దూకింది జలజల చేపపిల్లలా ఈతగొడుతూ నన్నూ రమ్మనమని చేయెత్తింది!... నేను ఒడ్డున కూచునే, ఈ జలక్రీడాదృశ్యం చూస్తున్నాను.

బంతిలా తేలిపోతూ, వెలకిలా పడుకొని లేలేత నీరెండ కిరణాల్ని వంటిమీద తెరిమిణీ పెట్టుకొంటూ జలకన్యలా జలకమాడుతోంది. ఆదృశ్యం చూచి భావోద్రేకంతో చలించాను.

గట్టుమీదికొచ్చి. నీరోడ్చుకొంటూ తల ఆరబెట్టుకొంటూ నిలబడింది. వేకువరాణి వంటినిండా తూలుతోన్న మంచుబిందువుల్లా, రీటా శరీరంమీంచి రేసుతోన్న నీటిబిందువులు చిందుతున్నాయి. ఎప్పుడు పడితే, అప్పుడు నీళ్ళలో మునిగిపోతుంది రీటా. వంటినంటి పెట్టుకొన్న తెల్లని గుడ్డ శరీరసౌందర్యాన్ని

వడగడుతోంది!...ఒంటిమీద ఒంపులూ సొంపులూ నిష్కపటంగా, సహజాతిసహజంగా ప్రదర్శిస్తూ...

రీటా! నీవో ప్రకృతిదేవతవి...వసంతకాలంలో వసంతకన్యవి......చలికి ముడుచుకుపోయే శిశిర కాంతవి...హేమంతకాలంలో కొత్తబట్టలు ధరించడానికి ఆకులు రాల్చే వనదేవతవి—ఈ వసంతంలో నీవూ నీ హృదయం ఎంతో బాగా చివురించి, మకరందంతో నిండిన నల్లకలువలా వున్నావు!...

అప్పట్నుంచీ రీటా మీద భావరేఖ కుదురుకోనారంభించింది.

ఈ జాతివాళ్లు సంతలు చేసుకోనేందుకు చుట్టుపక్కల్నుంచి, చాలామంది వస్తూ ఉంటారు! పుట్టలోనుంచి బైటబడ్డ పాముల్లా...మందు మూలికలు, తేనె, మైనం ఇంకా అడవి సరుకులు, తెచ్చి అమ్ముకుంటారు. అందులో రీటా ఇక్కడే స్థిరపడిపోయిందంటాడు చారీబాబు.

ఒకరాత్రి ఏంతోచక చారీబాబుగదికి వెళ్లి తలుపు తట్టాను. తలుపు తీసేవుందేమో, లోపలికి తోసుకుపోయింది తలుపు!

నూరు కొవ్వొత్తి దీపాలకాంతిలో...

కళ్లు బైర్లుకమ్మాయి. నల్లనిరాతివిగ్రహం చుట్టూ పెనవేసుకొన్న చారీబాబు

నాగొంతులో నాకే తెలియని అవ్యక్తమైన నాదం. ఈసమయంలో చీకటి నామీద ఎందుకువిరుచుపడిపోదూ? ఒక్కసారి జలజలవర్షంకురిసి, ఈ గదిని ప్రక్షాళించి పారేయదూ?

నేను వెనక్కు తగ్గిపోయాను.

నిశ్చేష్టుడైన చారీ ఏదో గొణిగాడు 'ఎందుకొచ్చావిక్కడికి? వెంటనే పో!'—

గదినిండా చీకటే...

ఇదా నీపని చారీబాబు! ఇప్పుడు నీకృత్రిమ స్వభావం అర్థమైంది! నీవు సృష్టించినవేనా? ఈ దయ్యాలూ, భూతాలు! ఉత్తముడివనుకొన్నాను - ఇంత నీచత్వానికి దాసుడివైపోతావనుకోలేదు. నీ స్వార్థరహితమైన హృదయం చుట్టూ పెనవేసుకొన్న చీకటిలో, నువ్వు చేస్తోన్న పని...ఇంత దిగజారిపోతావనుకోలేదు....'ప్రభుత్వానాకొం చూపిస్తే చాలు. వాళ్లు ఏది పడితే అది చేస్తారు' అన్నదానికిదా అర్థం... రీటా శపింపబడిన దేవతేమో అని భ్రమించాను. పిశాచ ప్రకృతి సాక్షాత్కరించింది—

నీ దేశంలో నిన్నెప్పుడూ ఆహ్వానించే ప్రియురాలు మేఘాల్నీ మంచునీ చలినీ కప్పుకొని దుఃఖిస్తోంది చూడు!

ఆ చీకటిలో ఎలా గది చేరుకొన్నానో. ఏ వెలుగు దారి చూపించిందో నాకు తెలీలేదు. నాగదిలో కాముహృదయంలా భయంకరంగా దీపం వెలుగుతోంది. చారీబాబు సృష్టించిన దెయ్యంలా చీకటి బయట వెంపరలాడుతోంది!

## 5

తర్వాత చారీబాబు ముఖం చూచినప్పుడెల్లా భయంకరమైన అనుభవం విషనాగంలా నన్ను కాటువేసేది. రెండు రోజులు ముభావంగా గడిచిపోయింది.

'అతన్నెందుకనుమానిస్తున్నావ్? నిస్వార్థమైన అతని స్నేహమకరందాన్ని ఆస్వాదించలేవా? ఏభయి రూపాయలు త్యాగం చేశాడు. నీకష్టం గట్టెక్కించాడు. నూతిలో పడబోయే అక్కయ్యని కాపాడాడు. అతడూ మానవుడే! ఆకలిదప్పులూ, ద్వేషం స్వార్థం రజస్తమోగుణాలూ అన్నీ ఉన్నాయి అతనిలో... కామప్రేరితమైన అతని గుణంలో స్నేహం వర్జనీయవస్తువుకాదు' నాఅంతరాత్మ సమాధానపడజొచ్చింది.

నా కంటె గుప్పెడు పొడుగు...చిక్కని మనసు...గతజన్మలో ఏదో పారేసుకొని, ఈ జన్మలో వెదుక్కునేందుకొచ్చిన నేత్రాలూ...చిత్రంగా స్నేహాన్ని కలుపుకొనే వ్యక్తి...చారీబాబు...అతనెప్పుడూ నా కళ్లలో ప్రతిఫలించాలి!

తర్వాత రీటా ఎప్పుడేనా కనిపిస్తే, జాలిగా నా కళ్లలోకి చూసేది. జ్వరంవచ్చి ప్రస్తుతం నేనిప్పుడిలా పడిపోయాను. నాకు జ్వరమని తెలియగానే చారీబాబు పరుగెత్తుకొచ్చాడు.

'నీవు మొన్న వాగులో నీళ్లు తాగావా?' అనడిగాడు.

'దాహం పట్టలేక తాగాను. పుడిసెడు... స్ఫటికంలా వున్నాయని నీళ్లు...వాటికేం?...'

'అదే కొంపముంచింది. ఇక్కడ కొన్ని వాగుల్లో మలేరియా అలలై ప్రవహిస్తోంది ఇంకా నయం...మరో రెండు గుక్కెళ్లు తాగావుకాదు.'

నా కళ్లు చెమర్చాయి. స్పృహలేకండా వున్నాను. చారీబాబుని చూసి, లేనిసత్తువ తెచ్చుకొని మాట్లాడాను.

అరగంటసేపు నా దగ్గర కూచుని మాట్లాడి, 'విశ్రాంతి తీసుకో వెళ్లివస్తా' అని వెళ్లిపోయాడు.

నేను గతాన్ని నెమరేసుకుంటూ మగతలో మునిగిపోయాను. మగతలో పీడకలలు...

అక్కయ్యని బావ ఇంట్లోనుంచి గెంటేసినట్టు—ఎవర్నో తెచ్చి పెట్టుకొన్నట్టు—

మనియార్డరు పోస్టుమేన్ కాజేసినట్టు—

ఇల్లంతా అల్లకల్లోలంగా వున్నట్టు—

అక్కయ్య నూతిలో పడ్డానికి పరుగెత్తుతూన్నట్టు—రకరకాల భావోద్వేగాలతో మెదడు కుతకుత ఉడుకెత్తిపోయింది. తల బరువుగా ఏ లోయల్లోకో క్రుంగిపోతోంది. వంటినిండా పొరగట్టిన నీరసం, నరనరాల వ్యాపించిన జ్వరం, మూలుగుతోన్న మూలుగు, గదినిండా వ్యాపించిన రోగవాయువు.— నాకు మృత్యువు చేరువలో ఉందా? అనిపించింది.

చావొచ్చి మీద పడుతుందేమో, అని భ్రమించిపోతాను. అప్పటికేపదకొండో ఐవుంటుంది—

గడియారం ముల్లు గుండెల్లో గుచ్చుకొంటున్నాయి. నా కళ్లు జ్యోతుల్లా మండుతున్నాయి.

అడుగుల చప్పుడు వినిపించింది. అలికిడయింది. బయట చారీబాబు పెట్టిన గొళ్లెంతీసిన చప్పుడైంది.

ఒక్కో అడుగు ముందు పడుతోంది మృత్యువు అడుగులేసుకొంటూ వస్తోందనుకొన్నా. లేకపోతే, ఇంత రాత్రివేళ ఎవరొస్తారు? ఆఫీసరా? జ్వాలానరసింహమా? శాస్త్రి?...ఎవరు?

ఆపాదమస్తకం కప్పుకొన్న ముసుగు తొలగించి చూశాను. వాళ్లెవరూ కారు!

అందరికంటె, అతీతమైనవ్యక్తి!

నా గుండెల్లో ఆవేదన, కడుపులో తపన—

అన్నింటినీ, ఏ అమృతహస్త స్పర్శలో, అదృశ్యంగా ఓదారుస్తున్నాయి.

నా కాళ్లు సమ్మెటతో బాదుతూన్నట్టు లాగుతున్నయ్! నరనరాలు జరజర లాగుతున్నాయి నా బతుకుమీద ఆశ మిణుకుమిణుకు మంటోంది అరుణతారలా.

నే నిప్పుడు వచ్చినవ్యక్తిని బాగా చూడగలిగాను దీపంకంటె ఎక్కువగా నా కళ్లు మంటలెత్తుతున్నాయి

నిగనిగలాడుతూన్న శరీరం...చీకటిని పులుముకొని, నన్ను పరామర్శించడానికొచ్చింది!

కళ్లు సూదుల్లా గుచ్చుకుంటున్నాయి.

పెదవులమీది గుసగుసలు వినిపిస్తున్నాయి

'చారీబాబు...' అన్నపదం ఉచ్ఛరించిన, ఆ ఎఱ్ఱని మందారంలాంటి పెదవులు మాట్లాడుతోన్న భాష నా కర్థంకాదు!

చారీ పంపితే, వచ్చానని కాబోలు చెబుతోంది.

అబ్బ! ఈ ఆవేదనలో, ఏవీ అర్థం కావటం లేదు! మనస్సు ప్రశాంతంగా ఉండాలని ప్రయత్నించుతోంది.

లేవబోయాను. బాధగా మూలిగాను.

రీటా దగ్గరకొచ్చి లేవదీయబోయింది.

నేను వారించి, నా అంతట నేనే గోడకి జారబడ్డాను ఏదో మూలిక ముక్కుదగ్గర పెట్టింది వాసన నాకేం తెలియలేదు. ఆ మూలిక నోట్లో పెట్టుకొని నవలమంది. నేను తీసుకొని నమలటానికి పూనుకొన్నాను. చేదుగా, వెగటుగా, వాంతి వచ్చినంత పనయింది. ఊమిసిపారేశాను.

ఎఱ్ఱగా కోపంగా, రీటా పెదవులు వణికాయి. నా నిస్సహాయతకి జాలిపడ్డాయి

మరో మూలిక తీసి ఇచ్చింది.

ఏమిటో, ఈ వనమూలికలు...ఏంపని చేస్తాయి నా జ్వరంమీద దీని పిచ్చిగాని...అనిపించింది!

ఏదో సీసా తీసి, నోరు చాపమంది.

పెదవులమీద ఒక్కో చుక్క తీసి పోస్తుంటే చప్పరించాను పుట్టతేనె కాబోలు...చిక్కని చేదు వాసన, తియ్యని వాసనా కలిసి సృష్టించిన రుచి—దిగజారిపోతోన్న ప్రాణాల్ని పైకి చేదుకునే, శక్తి ఆ మధువులో వుంది గాబోలు—సీసాలోదంతా తాగే

చాను. నా కళ్లు తృప్తిగా మెరిశాయి. కడుపులో తపన తగ్గింది. నాలో క్షీణిస్తున్న సత్తువ తిరిగి చేరుకొన్నట్టయింది.

తేలిగ్గా హృదయం తేరుకొంది.

నా కళ్లు కృతజ్ఞతాభావంతో వర్షించసాగినయ్! రీటా దేవతనిపించింది నా కోసం ఇంత కష్టపడుతోంది, ఎటువంటి సంబంధంలేని, ఈ మూర్తి. దీని కంతకీ ఏదో అవ్యాజమైన మనస్సంబంధమైన రజ్జువే.... కారణం...అనుకొంటాను

నా దీనస్థితికి నాకే ఏడుపొచ్చింది.

ప్రస్తుతం ఈ సమయంలో నా దగ్గర నాఅనే వాళ్లెవరూ లేరు-తల్లి లేదు, తండ్రి లేడు, బంధువుల్లేరు... ఆప్యాయంగా, 'నాయనా? ఎలావుంది?' అని పెదవి విప్పి పలకరించే, ఆప్తహృదయం లేదు — నన్నాదరించి, సమాశ్వాసించి, కన్నీరు నింపుతూ, 'నీ నుదురు వేడిగా వుందా? ఒంట్లో ఎలావుంది బాబూ!...కడుపులో తపన తగ్గిందా?...అబ్బ వళ్ళెలా సలసల కాగిపోతుందో? నా చిట్టితండ్రికే రావాలా ఇంతజ్వరం? ఎంత కష్ట మొచ్చింది నా బాబుకి!...త్వరలో తగ్గిపోతుందిలే!...ఈ మాత్ర వేసుకోవూ? ఈ రెండు రోజులు బాధపడాలి తండ్రీ! తర్వాత మాలో కలిసిపోతావు ... ఏడుస్తున్నావా? ఛా ... ఏడవొచ్చా? పిచ్చినాయనా! ఏడవకు...తగ్గిపోతుందన్నాంగా...'

చెమ్మగిలిన కళ్ళతో, జాలిగదిరే హృదయంతో, గద్గదకంఠంతో ఓదార్చే నాఅనేవాళ్లు లేని, ఈ అరణ్యమధ్యమందిరంలో చిక్కి చివికిపోతున్నాను. బాధలో కుమిలిపోతున్నాను. మానవతా దూరమైన ఏ కొండల్లోనో ఏ ప్రకృతిలోనో పుట్టి, పెరిగిన కొండజాతికాంత లాలనలో నిట్టూర్పు విడవాలిసొచ్చింది గదా? అని బావురుమని ఏడ్చాను. వెక్కి వెక్కి ఏడ్చాను. నా వెచ్చని కన్నీళ్లు చేత్తో తుడుస్తూ, తల నిమిరింది. నుదురుమీద చేయివేసి, ఆశ్వాసించింది. తన భాషలో జాలిగా గొణిగింది. తనూ నా దీనస్థితికి, కన్నుల కన్నీరు నించింది.

కళ్ళలోకి చూశాను కృతజ్ఞతాసూచకంగా.

సిగ్గు రేకులు రేకులుగా విడి, జాలిగామారి కలువల్లో కలిసి, ఏదో అపూర్వానుభూతిని స్ఫురింపజేస్తోంది.

ఆ చీకటిచుట్టూ పెనవేసుకోబోయాను. ఆ గుండెల్లో తలదాచుకొని. దీనంగా ఏడవాలనిపిస్తోంది.

చైతన్యవంతమైన రాతివిగ్రహంలాంటి ఈ మనిషి, నిశాకాంతలా, నల్లని ముసుగులో రాగిల్లింది నాముందు ... ఏవరం కోరినా దయచేసే మాతృహృదయం, మాధురీనిలయం...అన్నింటికీ సహించి, నన్ను సేదదీర్చింది. ఓదార్చింది బాగ పోకార్చింది. కార్చిచ్చులాంటి నా శరీరాన్ని చల్లని హస్తంతో సాకింది. నా కాళ్లలో ఉడిగిపోయిన జవసత్వాల్ని మేల్కొల్పింది తన తామరపువ్వుల్లాంటి చేతుల్తో...

నా శరీరం హాయిగా తేలిపోయింది. తర్వాత చల్లగా, నిద్రపోవడమే తెలుసు. చారీబాబుని కళ్ళ నిండా చూసుకుంటూ ఎంతసేపుందో, ఏమో...నిద్రపోయిందో లేదో నాకు తెలియనేలేదు ఆ చల్లనితల్లి —

## 6

తెల్లవారేసరికి జీపొచ్చింది. నేను వెళ్లిపోతుంటే, ఆఫీసంతా చూడ్డానికొచ్చింది. ఇంజనీరు కూడా చూసి, విచారించాడు. చారీబాబుకూడా నాతో వస్తున్నాడు గనక, నాకేలోటూ వుండదు. తిన్నగా విశాఖపట్నంలోపోయి పడితే, అక్కణ్ణుంచి బతికుంటే, ఎప్పటికైనా, ఇల్లు చేరుకోవచ్చు! ... రీటా వచ్చిందేమో?...అని చూశాను. రాత్రి జరిగిన విషయానికి సిగ్గుపడి రాలేదనుకొన్నా.

జీపులో ఎక్కేటప్పుడు ఉత్సాహంగా నే, ఎక్కాను పొద్దెక్కేకొలదీ, నాలో, చైతన్యం గాలి వేగానికి, హారతి కర్పూరంలా హరించుకుపోతోంది.

జీప్ రోడ్ని తరుముకుపోతోంది.

డుడుమా జలపాతం చూడనేలేకపొయ్యాను ఇంతదూరం వచ్చి కొండదారులు దిగేటప్పుడు ఎక్కేటప్పుడు నన్ను జాగ్రత్తగా పట్టుకొంటున్నాడు. పాపం! అతని కెందుకొచ్చిన బెడద?......

ఇంతదూరం వచ్చి, ఇంతమందిచేత సేవ చేయించుకోవడం నామీద నాకే అసహ్యమనిపించింది.

మగతగా వుంది మెదడు. అందులో దృశ్యాదృశ్యాలు...నాన్నా, అమ్మ, రెక్కలుగట్టుకొని, వాలుతున్నారు ... 'ఇంతదూరం ఎందుకొచ్చావురా నాయనా!...నిక్షేపంలా ఇంటిదగ్గరుండక...' అని వాపోతున్నారు!

నేనీ పర్వతాలనీ, పరిసరాల్ని విడిచివెళ్ళిపోతోన్నందుకు విషాదంగా విడ్కోలులా గాలిలో రొద వినిపించింది. పర్వతాలు కొల్వలు కన్నీళ్ళుగా ఏడుస్తున్నాయి...

నామీద పక్షి ఏడుస్తోన్నట్టు తల్లిదండ్రులు, నాలో జ్యోతి ఆరిపోయినట్టు...

'ఏవిటి కలవరిస్తున్నావు? నీకేం భయంలేదు... నీజ్వరం తగ్గేదాకా నీతో నే వుంటా...'

నేను కళ్లు తెరిచి చూశాను.

చారీబాబు నా పక్కనే, వున్నాడు. నా ఆత్మజ్యోతి ఇంకా వెలుగుతూ నే వుంది! ఇంకా బతికేవున్నా...

చారీబాబూ! నాబుణాన్నింకా ఎందుకు పెంచుతావు? నిశ్శబ్దంగా ప్రవహిస్తున్న ఏ కొండ వాగులోనో పారేస్తే, ప్రకృతిలో కొట్టుకపోతాను. మేఘాల సిట్టూర్పుల్లో మేలుకొంటాను. ఉదయారుణ సంధ్యా సౌందర్యంలో, ఒక మంచుబిందువుగా మిల మిల మెరుస్తాను. చీకటిముసుగు కప్పుకొని, వేకువని విప్పుకొని, మంచులో ముంచుకొనిపోయి బతుకు తెల్లవారుస్తాను.

బాధపడుతూ, నాలో నేనే ఆలోచించుకొంటూ, ఆ వెవిదాటి విశాఖ చేరేసరికి పొద్దు కుంకుతోంది.

హాస్పిటల్లో చేరిపించేటప్పుడు ఎంత ఖర్చయిందో, ఏమో నన్నో మంచంమీద పారేశారు. అన్నింటికీ దేవుడులాటి చారీ బాబు...

ఈ జ్వరం...విషజ్వరం...అని డాక్టరు తేల్చినట్టు నాకు తెలియకపోలేదు. చారీబాబు దాచినట్టు నేను గ్రహించాను. తర్వాత ఉత్తరం వ్రాయించాను ఇంటికి.

అక్కడే పడుకున్నాడు ఆరాత్రి...

నాకు నిద్రపోవడానికి మందిచ్చారు. ఐనా, నిద్రపట్టందే?...ఏవో మగతగా పీడకలలు మాత్రం... కొల్లలుగా కళ్ళలో కల్లోలం రేపుతున్నయ్!...

చారీబాబు హాయిగా నిద్రపోతున్నాడు నా గుండెల్లో ఈర్ష్య జ్వాల మేల్కొల్పుతూ...

లేచి, ఫ్లాస్కులో కాఫీ తాగుతున్నాను

గది కవతల అలికిడైంది.

లోపలికి తొంగి చూసింది పరిచితముఖం.

ఆశ్చర్యంగా చూశాను. 'నువ్వెలావచ్చావిక్కడికి?'—

'లారీ' అంది. చారీబాబుని లేపింది. కళ్లు నులుముకుంటూ విసుక్కుంటూ, కసుక్కుంటూ లేచాడు ఆశ్చర్యంగా.

మూలికా, మందు సీసాలో తేనె బయటికి తీసింది.

'పొద్దుట కనిపించకుండా, ఇక్కడికెలా వచ్చింది రీటా?...రాత్రి ఆ మూలికల మందు, తేనె తాగాను' అన్నాను నీరసంలో ఉత్సాహంతో—

'జ్వరానికది చాలా మంచి మందు...ఐతే, అన్నింటికీ అది పని చేస్తుందో లేదో చెప్పలేం!'

'ఐనా, ఆమందు నాకమృతంతో సమానం'

రీటా, ముందుకొచ్చి జాలిగా చూసింది. నేను నోరు తెరిచాను అమృతం వర్షించింది.

చారీబాబు నేత్రాలు, సంతృప్తిగా చెమర్చాయి.

రీటా మధుహృదయం, నన్నూ నా జీవితాన్ని తరుముతోంది. బాధగా కళ్లు మూసుకొన్నాను.

'మీరు దేవతలు'

నా గొంతులో అవ్యక్తమైన ధ్వని వాళ్ళకి వినిపించే వుంటుంది! తెల్లవారుతుందో లేదో! హాయిగా నిద్రపోయారు వాళ్ళిద్దరూ... నేనూ నిద్రకి ప్రయత్నిస్తున్నాను—

---

ఇందలి నేనూ, తదితరపాత్రలూ, చారీబాబు, రీటా కేవలం కల్పితం—ఎవరికీ సంబంధించినవి కావు. మాచ్ ఖండ్ ప్రకృతిసౌందర్యం వర్ణనాత్మక దృక్పథంలో మాత్రమే!